ప్రజాశక్తి
మంగళవారం 08 ఏప్రిల్ 2025
5
కర్నూలు

'బండ' బాదుడు..!

- ఒకే సారి రూ.50 పెంపు
- రూ.908 గృహ వినియోగ సిలిండర్ ధర
- సామాన్యులపై పెను భారం

సామాన్యులపై మరో సారి బండ బాదుడు పడింది. గ్యాస్ సిలిండర్‌పై కేంద్ర ప్రభుత్వం రూ.50 పెంచడంతో రూ.858 ఉన్న గృహ వినియోగ సిలిండర్ ధర రూ.908కి చేరింది. దీంతో సామాన్యులపై భారం పెరుగుతూనే ఉంది...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

వంట గ్యాస్ ధర మంట మళ్లీ మొదలైంది. కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకం పేరుతో గ్యాస్ సిలిండర్ ధర పెంచుతూ పోతుండటంతో సామాన్యులపై భారం పడుతూనే ఉంది. తాజాగా గ్యాస్ ధర ఒకే సారి రూ.50 పెంచడంతో రూ.858 ఉన్న గృహ వినియోగానికి వాడే 14.2 కిలోల గ్యాస్ సిలిండర్ ధర ఏకంగా రూ.908కి చేరింది. సామాన్యులపై గ్యాస్ భారం పెరిగింది. గృహ అవసరాలకు వినియోగించే 14.2 కిలోల వంట గ్యాస్ సిలిండర్ ధర 2021 జనవరిలో రూ.748.5 ఉండగా రూ.75.50 పెంచారు. దాంతో రూ.824కు చేరింది. అప్పటి నుంచి పెంచుకుంటూ పోవడంతో రూ.1158కి చేరింది. తరువాత నామమాత్రంగా తగ్గించడంతో రూ.858కి వచ్చింది. తాజా పెంపుతో మళ్లీ సామాన్యులపై భారం పడింది. ధరలను అదుపులో పెట్టాల్సిన ప్రభుత్వం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండటంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరో వైపు వంట గ్యాస్ సబ్సిడీని కూడా గాలికి వదిలేశారు. సాధారణంగా వంట గ్యాస్ ధర పెరిగే కొద్ది సబ్సిడీ మొత్తం కూడా పెరగాల్సి ఉంది. ఆ సబ్సిడీ కేంద్ర ప్రభుత్వం, చమురు కంపెనీలు వినియోగదారుడికి చెల్లించాలి. కరోనా సమయం నుంచి వంట గ్యాస్ సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం వినియోగదారుడి బ్యాంకు ఖాతాలో జమచేయడం లేదు. చమురు కంపెనీలు సబ్సిడీ రూపంలో రూ.41 మాత్రమే చెల్లిస్తోంది.

జిల్లాపై రూ.3.5 కోట్ల అదనపు భారం

సాధారణంగా సరాసరిన 40 రోజులకు ఒక గ్యాస్ సిలిండర్‌ను వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో దాదాపు 7 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వాటిలో 44వేల దీపం కనెక్షన్లు కూడా ఉన్నాయి. తాజాగా సిలిండర్‌పై మరో సారి రూ.50 పెంచడంతో జిల్లాలోని గ్యాస్ వినియోగదారులపై రూ.3.5 కోట్ల అదనపు ఆర్థిక భారం పడనుంది. జిల్లాలోని గ్యాస్ వినియోగదారులందరూ కలిసి ఇప్పటి వరకూ సరాసరిన రూ.60.06 కోట్లు గ్యాస్ కోసం ఖర్చు చేస్తుండగా ధర పెంపుతో ఆ ఖర్చు రూ.63.56 కు పెరిగింది.

బుకింగ్ రోజు ఓ రేటు..డెలివరీ రోజు ఇంకో రేటు

గ్యాస్ ధర బుకింగ్ రోజు ఓ రేటు ఉండగా ఇంటికి సిలిండర్ డెలివరీ ఇచ్చే రోజుకు ఇంకో రేటుకు మారిపోయింది. గ్యాస్ ధరల పెంపు మంగళవారం తెల్లవారుజాము నుంచి అమల్లోకి రావడంతో సోమవారం ఉదయం బుకింగ్ చేసిన సమయంలో పాత ధర రూ.858 చూపించింది. బిల్ తీసి మంగళవారం ఉదయం సిలిండర్ ఇచ్చే సమయానికి కొత్త ధర రూ.908గా బిల్‌లో వచ్చింది.

పేదల బతుకులతో ఆడుకుంటున్నారు

గ్యాస్ సిలిండర్ ధర పెంచి పేదల బ్రతుకులతో ఆడుకుంటున్నా రు. టిడిపి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంవత్సరంలో మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తానని చెప్పి మొదటి సిలిండర్‌కే డబ్బులు ఇవ్వలేదు. మళ్లీ రూ.50 రూపాయలు పెంచితే గ్యాస్ ఎలా కొని వంట చేసుకుని తినాలి. మహిళలు కట్టెలతో వంటలు చేస్తే కంటి జబ్బులు వస్తాయని చెప్పి గ్యాస్‌తో వంట చేసుకోవడం అలవాటు చేశారు. అలవాటు అయిన తర్వాత గ్యాస్ సిలిండర్ ధర ప్రతి సంవత్సరం పెంచుతూ పోతే ఎలా కొనాలి.

- లక్ష్మి, భాగ్యనగర్, కర్నూలు.

మోయలేని భారాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరల మీద ధరలు పెంచుతూ ప్రజల మీద మోయలేని భారాలు వేస్తున్నారు. గ్యాస్ ధర పెంచితే గ్యాస్ కొని వంట చేసుకుని తినే పరిస్థితి లేదు. ప్రజలు ఒక్క పూట తిని పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. గ్యాస్ ధరలు పెరగడంతో మళ్లీ కట్టెలు తెచ్చుకొని వండుకోవాల్సిన పరిస్థితి వస్తోంది. సామాన్య ప్రజల పరిస్థితులను గమనించి వెంటనే గ్యాస్ ధర తగ్గించాలి.

- రంగమ్మ, వీకర్ సెక్షన్ కాలనీ, కర్నూలు

అభివృద్ధికి బాటలు పడేనా..?

- జిల్లాను వెంటాడుతున్న సమస్యలు - నేడు జిల్లా సమీక్షా సమావేశం
- హాజరుకానున్న జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు అడుగులు ఇటుకంతైనా పడటం లేదు. దీంతో కరవు, వలసలు ఆగడం లేదు. దానికి తోడు జిల్లాలో సమస్యలు కూడా తీవ్ర స్థాయిలో ఉన్నాయి. మంగళవారం జిల్లా సమీక్షా సమావేశాన్ని నిర్వహించనున్నారు. జిల్లా ఇంఛార్జి మంత్ర నిమ్మల రామానాయుడు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. ఈ సమావేశంలో జిల్లాలోని సమస్యలను ఏ మేరకు పరిష్కారం చూపుతారోనని జిల్లా వాసులు ఎదురుచూస్తున్నారు...

తప్పని వలస వెతలు : ఏళ్లు గడుస్తున్నా జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో వలస వెతలు తప్పడం లేదు. ఉన్న ఊర్లో ఉపాధి లేకపోవడంతో పొట్ట చేతపట్టుకుని ఇతర పట్టణాలకు, నగరాలకు తరలిపోతున్నారు. కోసిగి, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, హోళగుంద, ఆలూరు, కోడుమూరు మండలాల నుంచి ఈ ఏడాది కూడా వలసలు ప్రారంభమయ్యాయి. తెలంగాణ, బెంగళూరు, గుంటూరు, ముంబైలకు తరలివెళ్లారు. కోసిగి మండలంలో అత్యధికంగా 6వేల కుటుంబాలు వలస బాట పట్టాయి.ఉపాధి పనుల్లో సరైన కూలి దక్కకపోవడంతోనే వలస వెళ్తున్నట్లు వలసదారులు చెబుతున్నారు.

ఉత్తిపోతలుగానే వేదవతి ఎత్తిపోతలు : కరవుకు నిలయమైన ఆలూరు ప్రాంతంలో పొలాలు పచ్చబడాలన్న ఉద్దేశంతో వేదవతి నది పరిధిలో నిర్మించిన ఎత్తిపోతలు ఉత్తిపోతలుగా మారాయి. వేదవతి నది పరిధిలో అమృతాపురం, జె.హొసళ్లి, సిద్ధాపురం వద్ద మూడు ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. 2008 లో మంత్రి మారెప్ప హయాంలో వీటిని చేపట్టారు. నిర్వహణలో లోపాలు అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో పథకాలు ఏడాదికే నిరుపయోగంగా మారాయి.

సమస్యలకు నిలయంగా జిల్లా కేంద్ర : జిల్లా కేంద్రం పలు సమస్యలకు నిలయంగా మారింది. శివారు కాలనీలకు తాగునీటి సమస్య పట్టిపీడిస్తోంది. కల్లూరుతో పాటు నూతనంగా నగర పాలక సంస్థ పరిధిలోకి వచ్చి చేరిన గ్రామాలలో నీటి సమస్య తీవ్రంగా ఉంది. పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో కూడా రెండు, మూడు రోజులకు ఒక సారి నీటిని వదులుతున్నారు. నగరంలోని చాలా ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వాన్నంగా మారింది. ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. వర్షాలు వస్తే మురుగు నీరు నేలపై పారుతున్నాయి. నగర జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికులు లేకపోవడంతోనే ఈ సమస్య నెలకొంది.

సాగు, తాగునీటికి తిప్పలే : ఆలూరు నియోజకవర్గంలో రైతులు వర్షాధారంపై ఆధారపడి జీవిస్తారు. సాగు నీరు లేక పోవడం, సకాలంలో వర్షాలు లేక రైతులు, వ్యవసాయ కార్మికులు ఎక్కువగా సుదూర ప్రాంతాలకు వలసలు వెళుతున్నారు. తాగు నీటి కోసం ఎల్ఎల్‌సి, హెచ్ఎల్‌సి నుండి ఎత్తిపోతల ద్వారా నియోజకవర్గ ప్రజలకు తాగునీరు అందుతుంది. వర్షాకాలంలో వారానికి ఒకసారి, వేసవిలో 15 రోజుల నుండి 20 రోజులకు నీరు అందిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలు, పట్టణాల్లోనూ తాగునీటి కోసం తిప్పలు తప్పడం లేదు.

ఉన్నత విద్యాసంస్థలకు నిధుల కొరత : కర్నూలు జిల్లా చుట్టూ అనేక విద్యా సంస్థలు ఉన్నప్పటికీ వాటి నిధుల కొరతతో అభివృద్ధి చెందడం లేదు. రాయలసీమ విశ్వ విద్యాలయంలో కొత్త కోర్సులను ప్రవేశపెట్టి ఇక్కడ అనేక విభాగాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేసి ఉన్నత విద్యాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

రోడ్లు, పంట కాలువలు, తాగునీటిపై దృష్టి పెట్టాలి

జిల్లాలో రోడ్లు ఎక్కడా అభివృద్ధి చేయలేదు. ప్యాచ్ వర్కులు తప్ప కొత్త రోడ్లు ఎక్కడా వేయలేదు. గుంతలు పూడ్చడం మాత్రమే చేశారు. జిల్లాలోని చాలా గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి కొరత ఉంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హంద్రీనీవా సుజల స్రవంతి పారుతున్న దేవనకొండ, పత్తికొండ, కృష్ణగిరి మండలాల్లో పంట కాలువలు లేవు. దాంతో నీరు రైతుల పొలాలకు చేరడం లేదు. జిల్లా సమీక్షా సమావేశంలో రోడ్ల అభివృద్ధి, తాగునీటి కొరత తీర్చడం, హంద్రీనీవాకు పంట కాలువలు నిర్మించడంపై దృష్టి పెట్టాలి.

- డి.గౌస్ దేశాయ్, సిపిఎం జిల్లా కార్యదర్శి.

ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ ఒత్తిళ్లు ఆపాలి

- కలెక్టర్‌కు సిఐటియు వినతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లపై జరుగుతున్న రాజకీయ ఒత్తిళ్ళను ఆపాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు డిమాండ్ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేష్ గౌడ్ తో కలిసి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల పైన రాజకీయ ఒత్తిళ్లు పెరిగిపోయాయని తెలిపారు. దీన్ని అరికట్టడానికి జిల్లా అధికారులు కృషి చేయకపోగా వారికి మరింతగా సహకరించే విధంగా వారి చర్యలు ఉంటున్నాయని అన్నారు. ఆలూరు మండలం అరికెర గ్రామంలో ఈరన్న అనే ఫీల్డ్ అసిస్టెంట్ పై హత్య జరిగినప్పటికీ తగిన చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని అన్నారు. అధికారులు రాజకీయ నాయకులు కలిసి ఫీల్డ్ అసిస్టెంట్లను ఇంటికి పంపించే ప్రయత్నం చేస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. ఆస్పరి మండలం డి.కోటకొండ గ్రామంలో శనివారం వరకు పనులు చేయిస్తే ఆదివారం రోజు యంత్రాలతో రాజకీయ నాయకులు పనులు చేయించి సోమవారం ఫీల్డ్ అసిస్టెంట్లు యంత్రంతో పని చేయించినట్లు యంత్రాలతో పని చేయించాడు కాబట్టి నిన్ను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించడం చూస్తుంటే అధికారులు ఏ రకంగా రాజకీయ నాయకులతో కలిసిపోతున్నారో అర్థం అవుతుందని అన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకొని రాజకీయ ఒత్తిళ్లను ఆపాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. మండల స్థాయిలో బదిలీకి అవకాశం కల్పించాలని, అనుభవం,అర్హత ఉన్నవారికి ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. హైకోర్టు నుంచి ఆర్డర్ వచ్చిన వారికి ఆర్డర్స్ ను అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని అన్నారు. పర్సనల్ హియరింగ్ జరిగిన వారిని విధుల్లోకి తీసుకోకుండా ఆలస్యం చేస్తున్నారని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఆలూరు మండలం మరికెర గ్రామంలో హత్యచేసిన ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్న కుటుంబానికి ఆర్థిక సహాయం రూ. 25 లక్షలు చెల్లించాలని కోరారు. వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండేస్ విధానం రద్దు చేయాలని కోరారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేష్ గౌడ్ మాట్లాడుతూ రాబోకాలంలో ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారం కొరకు ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లు యూనియన్ నాయకులు విశ్వనాథ్, ఆంజనేయ, పవన్ కళ్యాణ్ తాయప్ప, మారెప్ప, కృష్ణ, వీరేష్, దస్తగిరి ప్రతాప్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎండి అంజిబాబు

దరఖాస్తుల పరిష్కారానికి శ్రద్ధ అవసరం

- కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పిజిఆర్ఎస్ లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ లో వచ్చిన అర్జీలను నిర్దేశించిన గడువులోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రీఓపెన్ కేసులు 104 ఉన్నాయని, వీటి పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పదేపదే అర్జీదారులు సమస్యల పరిష్కారం కోసం తిరగకుండా నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. పరిష్కరించలేని సమస్యలు ఉంటే, ఆ విషయాన్ని స్పష్టంగా దరఖాస్తుదారునికి తెలియచేయాలన్నారు. సిఎంఒ గ్రీవెన్స్‌లను ఆయా శాఖల జిల్లా అధికారులు సీరియస్‌గా తీసుకుని పెండింగ్ లేకుండా త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పరిష్కారం అయిన అర్జీలను సక్రమంగా పరిష్కరించారా లేదా అని ఆయా శాఖల జిల్లా అధికారులు ఆడిట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, డిఆర్ఒ సి.వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ప్రోత్సాహం

విభిన్న ప్రతిభావంతులకు ప్రోత్సాహంగా రాష్ట్ర ప్రభుత్వం ల్యాప్ టాప్‌లను, సెల్ ఫోన్లను అందచేస్తోందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన 3 ల్యాప్ టాప్‌లను, 2 సెల్ ఫోన్లను జిల్లా కలెక్టర్ విభిన్న ప్రతిభావంతులకు అందజేశారు.

వికలాంగులకు ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు అందజేస్తున్న కలెక్టర్

జెమ్ కేర్ కామినేని లో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జ్ లీలా వెంకట శేషాద్రి

కనీస జాగ్రత్తలతో ఆరోగ్యం పదిలం

జెమ్ కేర్ కామినేని లో వరల్డ్ హెల్త్ డే కార్యక్రమం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రతిఒక్కరు చిన్నపాటి జాగ్రత్తలో ఆరోగ్యంగా ఉండాలని జెమ్ కేర్ కామినేని హాస్పిటల్ ఎండి, సిఇఒ డాక్టర్ చంద్రశేఖర్, ముఖ్యఅతిథులు జిల్లా లీగల్ అథారిటీ సర్వీసెస్ సెక్రటరీ అండ్ సీనియర్ సివిల్ జడ్జ్ లీలా వెంకట శేషాద్రి ,అడిషనల్ డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ సూచించారు. వరల్డ్ హెల్త్ డే కార్యక్రమాన్ని కేక్‌కట్ చేసి వారు ప్రారంభించారు. ఎండి ,సిఇఒ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ బీపీ షుగర్‌ను కంట్రోల్ లో ఉంచుకోవాలన్నారు. జంక్ ఫుడ్స్ జోలికి వెళ్లకుండా మంచి ఆహారం తీసుకోవాలన్నారు. అవసరమైనంత నిద్ర, వ్యాయామంకు సమయం కేటాయించాలన్నారు. ఇటువంటి కనీస జాగ్రత్తలు పాటిస్తే అనారోగ్య ఉండవచ్చన్నారు. 1948లో ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య సంస్థ వరల్డ్ హెల్త్ డేను డిక్లేర్ చేసిందన్నారు. రోగులకు ఆరోగ్య సమస్యలపై అవగాహన కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఎవరికైనా పక్షవాతం లక్షణాలు కనిపిస్తే నాలుగు గంటల లోపు సమీప ఆసుపత్రికి తీసుకెళ్లి అవసరమైన ఇంజక్షన్ వేయిస్తే పూర్తిగా కోలుకుంటారన్నారు. దానినే గోల్డెన్ అవర్స్ అని అంటారని డాక్టర్ నిశాంత్ రెడ్డి తెలిపారు. గైనకాలజిస్ట్ డాక్టర్ శృతి మాట్లాడుతూ వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ఈ సంవత్సరము తల్లి బిడ్డ క్షేమం థీమ్‌గా తీసుకుందన్నారు. ఆమె మాట్లాడుతూ సమయానికి సరైన ఆహారం తీసుకోవాలన్నారు. రెగ్యులర్ చెకప్, యోగా చేయాలన్నారు. ప్రతి నెలా రెండో శనివారం జెమ్ కేర్ కామినేని హాస్పిటల్‌లో యాంటీనైటల్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. జెమ్‌కేర్ హాస్పిటల్ ఆర్థోపెడిషియన్ డాక్టర్ రవిబాబు, సర్జన్ డాక్టర్ బాలమురళి, డాక్టర్ రామ్మోహన్ మెడికల్ సూపరింటెండెంట్, కార్డియాలజిస్ట్ డాక్టర్ రాఘవేంద్ర, సిఒఒ డాక్టర్ గణేష్, ఆపరేషన్స్ డిప్యూటీ జనరల్ మేనేజర్ నదీమ్, ఆపరేషన్స్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ డాక్టర్ కృష్ణ పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జిగా జెసి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జిగా జాయింట్ కలెక్టర్ బి.నవ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ కార్యదర్శి కె. ప్రకాష్ పుష్ప గుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

పత్తికొండ ఎంపిడిఒగా కవిత

ప్రజాశక్తి-పత్తికొండ: పత్తికొండ మండల పరిషత్ కార్యాలయంలో పత్తికొండ ఎంపిడిఒ గా కవిత సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలను సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటానని అన్నారు. ప్రస్తుత ఎంపిడిఒగా ఉన్న సువర్ణలత ఎఒగా బాధ్యతలు చేపట్టారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి

మున్సిపల్ అధికారుల సమీక్షలో మంత్రి టిజి భరత్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగరంలోని వీధుల్లో ఎలాంటి సమస్యలున్నా వెంటనే పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. నగరంలోని ప్రభుత్వ అతిథి గృహంలో ఆయన మున్సిపాలిటీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానంగా తాగునీటి సమస్య, దోమలు, కుక్కల బెడదపై చర్చించారు. నగర ప్రజలకు సమయానికి తాగునీరు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. నగరంలోని ఏ ఒక్కరూ నీరు అందడం లేదని ఫిర్యాదు చేయకుండా ఉండేలా పనిచేయాలని అన్నారు. ప్రతి వీధిలోని మురుగు కాలువలు శుభ్రంగా ఉండాలని, చెత్తను ఎప్పటికప్పుడు సేకరించాలన్నారు. వీధి కుక్కల సమస్యను సీరియస్‌గా తీసుకోవాలని చెప్పారు. పాతబస్తీలో కుక్కల దాడులు జరిగిన విషయాన్ని ప్రస్తావించి.. ఇలాంటివి మరోసారి పునరావృతం కాకుండా చూడాలన్నారు. నగరంలో ఉన్న పార్కుల పరిస్థితిపై పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలన్నారు. దీంతో పాటు దోమలను అరికట్టేందుకు ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలన్నారు. తన ఫ్యాక్టరీ నుండి ఉచితంగా హైపో ద్రావణం అందజేస్తున్నానని.. దీన్ని పూర్తి స్థాయిలో వినియోగించి దోమల సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఇక భూమిపూజ చేసిన పనులన్నీ వెంటనే పూర్తి చేయాలన్నారు. స్పీడ్ బ్రేకర్స్ వేసి వాటిని గుర్తుపట్టకుండా అలాగే వదిలేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, స్పీడ్ బ్రేకర్ ఉందని గుర్తుపట్టేందుకు పెయింటింగ్ వేయాలన్నారు. నగరంలో ఉన్న 107 టాయిలెట్ల నిర్వహణ పక్కాగా జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రవీంద్ర బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు

మాట్లాడుతున్న మంత్రి టిజి భరత్ , హాజరయిన అధికారులు

ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని కాపాడుదాం

'ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవగాహన

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్ : ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాదికారి డాక్టర్ పి.శాంతి కళ ఆద్వర్యంలో పట్టణ ఆరోగ్య కేంద్రం మెరీడియన్ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపుమేరకు మొదటి 'ప్రపంచ ఆరోగ్య దినోత్సవం" 1948, ఏప్రిల్ 7న నిర్వమించారన్నారు. ఈ సంవత్సరం (2025) ఆరోగ్యకరమైన ప్రారంభం–ఆశాజనక భవిష్యత్తు అను నినాదంతో అవగాహన కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాతృ . శిశు మరణాలను తగ్గించవచ్చునని తెలిపారు. సెట్కూరు సిఇఒ వేణుగోపాల్ మాట్లాడుతూ మాతా శిశు ఆరోగ్యమే దేశ సౌభాగ్యం కాబట్టి కిశోరబాలికలలో పోషకాహార లోపం, బాల్య వివాహాలు , టీనేజ్ గర్భం పై అవగాహన కల్పించాలని సూచించారు. దీనివలన తల్లీ బిడ్డల ఆరోగ్యానికి దోహద పడుతాయని తెలిపారు. అనంతరం ఆరోగ్యకరమైన ప్రా రంభం ఆశాజనక భవిష్యత్తు , ఏ స్త్రీ జన్మనిస్తూ మరణించ కూడదు.. ఏ బిడ్డ జన్మిస్తూ మరణించ కూడదు.. అను నినాదాలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధి ,కారులు, ఆరోగ్య కార్యకర్తలు, నర్సింగ్‌సిబ్బంది పాల్గొన్నారు.

ఎకరాకు రూ.20 లక్షల పరిహారం ఇవ్వాలి

జాయింట్‌కలెక్టర్ ఎపి రైతు సంఘం వినతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్లు మండలం కొమరోలు ఎపిఐఐసి పేరుతో తీసుకున్న భూములకు పూర్తిగా అంటే ఎకరాకు రూ20లక్షల నష్టపరిహారం అన్న ఇవ్వాలి లేదా ఆన్‌లైన్‌లో రైతు పేరు నమోదు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్యకు వినతి పత్రం సమర్పించారు. జి రామకృష్ణ మాట్లాడుతూ ఎస్‌సి సామాజిక తరగతికి చెందిన రైతులు గత 40 యేళ్లకు పైగా కొమరోలు గ్రామ పొలిమేరలో రాళ్లు, చెట్లు కొట్టి భూములను చదును చేసి సాగుచేస్తూ జీవనం పొందుతుండగా ,2005 లో ప్రభుత్వం వారు గుర్తించి పట్టా పాస్ పుస్తకాలు మంజూరు చేశారని తెలిపారు. అలాంటి భూములలో రైతుల పేర్లను తొలగించి ఎపిఐఐసి పేరుతో ఆన్‌లైన్‌లో నమోదు చేసి రైతులకు తీరని అన్యాయం చేశా రన్నారు. పేద రైతులకు రెండు, మూడు, ఐదె కరాలు వరకు పట్టాలు ప్రదానం చేయగా ఎస్‌సిలలో పేదలకు కేవలం ఎకరా, రెండెక రాలకు నష్టపరిహారం ఇచ్చి మిగతా వాటిని కూడా స్వాధీనపరచుకోవడం చాలా దుర్మార్గ మైన విషయమని విమర్శించారు. కొందరికైతే అసలుకే నష్టపరిహారం ఇవ్వలేదని, ఇది మరింత దుర్మార్గమన్నారను.2015 సంవత్సరంలో ప్రభుత్వం ఓరకల్లు మండలాన్ని పరిశ్రమల హబ్ ఏర్పాటుకు ప్రభుత్వ భూములకు, పట్టా భూములకు ఎకరాకు రూ.4.5 లక్షల నామమాత్రం పరిహారం ఇవ్వడం అంటే రైతుల గొంతు కోయడం తప్ప మరొకటి కాదన్నారను. కొమరోలు గ్రామ పొలిమేరలో 155 , 155/ఎ లో బైనపల్లి గ్రామానికి చెందిన ఎస్‌సిలు 30 ఏళ్లకు పైగా వారి పెద్దల నుండి భూములను సాగు చేస్తు పట్టా పొంది జీవనం పొందుతున్నారన్నారు. అలాంటి రైతుల భూములను కొంతమందికి పట్టాలు ఉన్నదానికంటే తక్కువ భూములకు నష్టపరిహారం ఇచ్చి మరి కొంతమందికి ఎటువంటి నష్ట పరిహారం ఇవ్వకుండా రైతుల పేర్లను ఆన్‌లైన్ నుండి తొలగించి ఎపిఐఐసి పేరు నమోదు చేసి ఎస్‌సి రైతులకు ప్రభుత్వం నుండి ఎటువంటి విత్తనాలు ఎరువులు, మందులు, అన్నదాత సుఖీభవ, ఇన్పుట్ సబ్సిడీ ఇన్సూరెన్స్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకుండా చేశారన్నారు. జెసి స్పందించి ఎపిఐఐసి జిఎంతో మాట్లాడి రైతుల భూ ములకు రెండు వారాలలో నష్టపరిహారం ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులు లక్ష్మీదేవి, రామలక్ష్మమ్మ, ఈశ్వరమ్మ, చిన్న రంగమ్మ ,పెద్ద రంగమ్మ, దాసరి అయ్యమ్మ పాల్గొన్నారు.

జాయింట్ కలెక్టరేట్‌కు వినతిపత్రం ఇస్తున్న జి.రామకృష్ణ, నాగన్న

పేదలకు పండ్లు ,కూరగాయలు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలి

సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్‌శర్మ
పేదలకు పండ్లు, కూరగాయలు పంపిణీ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రతి ఒక్కరూ పండ్లు, ఆకుకూరలు, కూరగాయలను ఆహారంలో తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించేందుకు అవకాశం ఉంటుందని సీనియర్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. కర్నూలు గాయత్రి ఎస్టేట్‌లోని శ్రీ గురుదత్త పాలిక్లినిక్‌లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నిరుపేదలకు ఆయన పండ్లు ,ఆకుకూరలు, కూరగాయలను పంపిణీ చేశారు. డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ 1948వ సంవత్సరంలో స్విట్జర్లాండ్ లోని జెనివాలో వరల్డ్ హెల్త్ అసెంబ్లీ సమావేశం జరిగిందని వివరించారు. ఏప్రిల్ 7న విశ్వ మానవాళికి ఉపయోగపడే విధంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆవిర్భవించిందని వివరించారు. ఈ సంస్థ ప్రపంచంలోని అన్ని దేశాలలో ప్రజల ఆరోగ్య సంరక్షణ ధ్యేయంగా పనిచేస్తుందని వివరించారు. ఈ సంస్థ ప్రతి సంవత్సరం ఒక నినాదంతో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహిస్తుందన్నారు. ఈ ఏడాది తల్లి పిల్లలు, వృద్ధుల ఆరోగ్య పరిరక్షణ కోసం నినాదం తీసుకుందన్నారు. ప్రభుత్వాలతో పాటు స్వచ్ఛంద సేవా సంస్థలు, మానవతావాదులు సమాజంలోని నిరుపేదల ఆరోగ్యం ,అభివృద్ధి కోసం పాటుపడాల్సిన అవసరం ఎంతో ఉందని వివరించారు. సమాజంలో పేదలు ఎంతోమంది ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని అలాంటివారిని ఆదుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు. మారిన జీవనశైలి వల్ల ప్రస్తుతం సరైన వ్యాయామం లేకపోవడంతో మధుమేహం, రక్తపోటు, ఊబకాయం వంటి దీర్ఘకాలిక వ్యాధులు వస్తున్నాయన్నారు. వాటిని రాకుండా ప్రతి ఒక్కరూ మంచి ఆహారపు అలవాట్లతో పాటు ప్రతిరోజు వ్యాయామం చేయడం అలవాటు చేసుకోవాలని వివరించారు.

విద్యుత్ స్లాబులు పెంచడం బాధాకరం

సిపిఎం నాయకులు వెంకటేశ్వర రెడ్డి

ప్రజాశక్తి-మద్దికేర

విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల్లో హామీలు ఇచ్చి, అవసరమైతే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామంటూ బూటకపు హామీలు ఇచ్చి, అధికారం చేపట్టగానే విద్యుత్ చార్జీల బాధుడు మొదలెట్టారని పత్తికొండ సిపిఎం కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి విమర్శించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే విద్యుత్తు చార్జీలు పెంచిందన్నారు. పెంచిన కరెంటు చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వినియోగదారులే కరెంట్ అమ్మేలా చేస్తానంటూ ప్రగల్బాలు పలికి అధికారంలోకి వచ్చిన తర్వాత హామీని తుంగలో తొక్కారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కడవల రవికుమార్, , రాముడు, ఆమాలీలు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు నల్లప్ప

అంటరానితనంపై పోలీసుల వైఖరి తేల్చాలి

- కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు నల్లప్ప

ప్రజాశక్తి - ఆదోని

దళితులు ఎదుర్కొంటున్న అంటరానితనంపై పోలీసుల వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు నల్లప్ప నిలదీశారు. సోమవారం ఆదోనిలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో నాయకులతో కలిసి మాట్లాడారు. అంబేద్కర్ జయంతిలో భాగంగా ఆదోని మండలం సంతేకుడ్లూరు గ్రామంలో యువతలో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయడం కోసం క్రికెట్ టోర్నమెంట్ పెడితే అడ్డుకుంటారా అని మండిపడ్డారు. అంటరానితనంపై పోలీసుల వైఖరి ఏమిటో తేల్చాలని డిమాండ్ చేశారు. క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం జరుగుతుండగా పోలీసులు వచ్చి దీనికి అనుమతి తీసుకోవాలంటూ అడ్డుకోవడం అంబేద్కర్ అవమానించడం కాదా అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒకరోజు ముందు వెళ్లి అనుమతి అడిగితే ఇవ్వని పోలీసులు, దళితులు మానసికంగా, శారీరకంగా ఎదగడం ఇష్టం లేని ఆధిపత్య వర్గాలు, ఆటంకవాదులు చెప్పిన మాటలను భుజానేసుకుని టోర్నమెంట్ జరపడానికి వీల్లేదు అంటూ ఆపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గత రెండేళ్ల క్రితం గ్రామంలో కొనసాగుతున్న జటిలమైన అంటరానితనాన్ని కెవిపిఎస్ ఆధ్వర్యంలో పోలీసు, రెవెన్యూ అధికారుల సమక్షంలోనే ప్రతిఘటించి పారదోలామని తెలిపారు. తిరిగి అంటరానితనం ఉండాలని కోరుకునే వర్గాలకు పోలీసులు అండగా ఉండడం ఏమిటని ప్రశ్నించారు. రాజ్యాంగబద్ధంగా అంటరానితనాన్ని నిర్మూలించాల్సిన పోలీసులే ప్రోత్సహించడం సరైంది కాదన్నారు. ఇదే పద్ధతి కొనసాగితే పోలీసు విధానానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం టోర్నమెంట్ కొనసాగడానికి అనుమతిని ఇప్పించారు. కెవిపిఎస్ మండల కార్యదర్శి తిక్కప్ప, గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు పరమేష్, సిద్దప్ప, కమిటీ సభ్యులు వీరన్న, భీమేష్, జీవరత్న, కోసిగి ఈరన్న, లాజరు, రాము పాల్గొన్నారు.

'తాగునీటి సమస్య రాకుండా చర్యలు'

ప్రజాశక్తి - చిప్పగిరి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ అల్లా బకష్

మండలంలోని 13 పంచాయతీల్లో వేసవి దృష్ట్యా తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడకుండా అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని ఎంపిడిఒ అల్లా బకష్ తెలిపారు. సోమవారం మండల కార్యాలయంలో ఇఒఆర్‌డి బాలన్న ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టడానికి సిద్ధంగా ఉండాలని గ్రామాల్లో విధులు నిర్వర్తించే పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ప్రజలు కూడా ట్యాంకుల దగ్గర, నీటి కుళాయిల దగ్గర తాగునీటిని అనవసరంగా వృథా చేయకూడదన్నారు. అత్యవసరమైతే ఎక్కువగా తాగునీటి సమస్య ఉన్న దగ్గర, ఆయా కాలనీలకు ట్రాక్టర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా బోర్లు, పైపులైన్లు పగిలిపోతే స్పందించి సమస్యలను పరిష్కరించాలని కార్యదర్శులను ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు జయరాం నాయక్, సిసింద్రీ, సురేంద్ర, ప్రమీల, సుధీర్, నరసింహులు, హౌసింగ్ ఎఇ భవ్య పాల్గొన్నారు.

ఫలితాల కోసం ఎదురుచూడకుండా
ఇంటర్‌లో ప్రవేశాలు పొందండి

- ఇన్‌ఛార్జీ ప్రిన్సిపల్ జ్యోతి

ప్రజాశక్తి - గోనెగండ్ల

పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు ఫలితాల కోసం ఎదురు చూడకుండా గోనెగండ్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలు పొందవచ్చని కళాశాల ఇన్‌ఛార్జీ ప్రిన్సిపల్ జి.జ్యోతి తెలిపారు. సోమవారం ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఇప్పటికే సెకండ్ ఇయర్ క్లాసులు ప్రారంభమయ్యాయని అన్నారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు కూడా ఫలితాల కోసం ఎదురు చూడకుండా నేరుగా కళాశాలకు వచ్చి తమకు నచ్చిన గ్రూపులో అడ్మిషన్ పొందవచ్చని తెలిపారు. వారికి క్లాసులు కూడా త్వరలోనే ప్రారంభమవుతాయని చెప్పారు.

పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపల్ జ్యోతి

అంబేద్కర్ జీవితం ఆదర్శం

- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ బాబు

ప్రజాశక్తి - మంత్రాలయం

బడుగు, బలహీన వర్గాల హక్కుల ప్రధాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జీవితం అందరికీ ఆదర్శమని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.ఆనంద్‌బాబు తెలిపారు. సోమవారం అంబేద్కర్ జయంతి మాసోత్సవాల్లో భాగంగా కెవిపిఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జీవితాన్ని ప్రజల ముందు ఉంచడం కోసం కళారూప ప్రదర్శన నిమిత్తం కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జయరాజు, మండల అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, అంజితో కలిసి స్థలాన్ని పరిశీలించారు. మండలంలోని మాధవరం గ్రామంలో కెవిపిఎస్ ఉన్న పొలాలతో పాటు, సెయింట్ థోమస్ హైస్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అంటరానితనంపై యుద్ధం ప్రకటించి సమసమాజ స్థాపనకు కృషి చేసిన మహనీయుడు అంబేద్కర్ అని తెలిపారు. ప్రతి వ్యక్తీ తమ పాలకున్ని ఎన్నుకునే ఒక అద్భుతమైన విధానాన్ని సృష్టించిన ఘనుడు అంబేద్కర అని చెప్పారు. జటిలమైన కుల జాఢ్యం కలిగి ఉన్న ఆధిపత్య సమూహాలకు మాత్రమే దక్కిన హక్కులను పటాపంచలు చేసి, వేల కులాలను నాలుగు తరగతులుగా మార్చి వర్గాల పొందికను అమర్చి హక్కుల ప్రసాదించిన జ్ఞానశీలి అని కొనియాడారు. నేటి తరానికి అంబేద్కర్‌ను చూపించడం కోసం, అంబేద్కర్ ఒక కులానికి చెందిన వాడు కాదని.. సమాజం అందరికీ కావాల్సిన వారు అనే సత్యాన్ని తెలియజేయడం కోసమే ఈ నాటకాలను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. నాటకానికి సహకరించి నియోజకవర్గ ప్రజలందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. డప్పు కళాకారుల సంఘం మండల కార్యదర్శి మారెప్ప, నాయకులు ఇజ్రాయేల్, హనుమంతు, వీరేష్, ఇస్సాక్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆనంద్ బాబు

వైభవంగా సీతారాముల కల్యాణ రథోత్సవం

- తరలివచ్చిన భక్తజనం

ప్రజాశక్తి - చిప్పగిరి

రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే విరుపాక్షి

శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని నేమకల్లు గ్రామంలో సీతారాముల కల్యాణ రథోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు బెల్డోన రామనాథ శాస్త్రి స్వామి, రాముస్వామి ఆధ్వర్యంలో సీతారాముల ప్రతిమలకు వేకువ జామున ప్రత్యేక అలంకరణ చేసి ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. స్వాములవారికి తలంబ్రాలు వేసిన అనంతరం మడకతేరు నిర్వహించారు. సాయంత్రం పురవీధుల గుండా గ్రామ పెద్దలు, ప్రజల ఆధ్వర్యంలో అశేష జన వాహిని మధ్య భక్తిశ్రద్ధలతో సీతారాముల కల్యాణం రథోత్సవం నిర్వహించారు. సీతారాముల ఆలయం నుంచి రాంపురం ఆంజనేయస్వామి ఆలయం వరకు వైభవంగా రథోత్సవం సాగింది. తోలుబొమ్మల నృత్యం, కోలన్నలాట పలువురిని ఆకట్టుకుంది. యువకులందరూ రంగులు వేసుకుంటూ నృత్యం చేశారు. అన్నదానం, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు నిర్వహించారు. స్వాముల వారి రథోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే విరుపాక్షి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచి ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే విరుపాక్షికి ఘనంగా స్వాగతం పలికి, అనంతరం పూలమాల, శాలువాతో సన్మానించారు. రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా చిప్పగిరి ఎస్ఐ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

అర్జీలను నాణ్యతగా పరిష్కరించండి

- ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఆదోని

అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జిదారులను సంతప్తిపరిచేలా చూడాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం – పిజిఆర్ఎస్‌లో సబ్ కలెక్టర్ పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఎలోకి వెళ్లకుండా చూడాలన్నారు. వృద్ధాప్య పింఛను, ఇంటి పట్టా మంజూరు చేయాలని కౌతాళం మండలం కామవరం గ్రామానికి చెందిన శివలింగప్ప వినతిపత్రం అందజేశారు. బీసీ కాలనీలో తాగునీటి కుళాయి ఉండగా తాగునీరు వదిలిన సమయంలో అందరికీ సరిపడ నీరందడం లేదని, వాటిలో కొన్నింటికి డ్రాఫ్ట్ వాల్స్ ఏర్పాటు చేయడం ద్వారా తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని ఆదోని మండలం ఢణాపురం గ్రామానికి చెందిన ఉమాదేవి, ఖాసీంబీ, శివమ్మ, తులసి కోరారు. తనకు వికలాంగుల పింఛను మంజూరు చేయాలని కౌతాళం మండలం వల్లూరు గ్రామానికి చెందిన ఆనంద్ కోరారు. సర్వే నెంబర్ 159లో 8.06 ఎకరాల భూమి వారసత్వంగా సంక్రమించిందని, ఆ భూమి హద్దులు సరిగా లేనందున సర్వే చేసి హద్దులు చూపాలని ఆదోని పట్టణానికి చెందిన సూర్య పోగు మోజెస్ వినతిపత్రం అందజేశారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్స్ శ్రీనివాసరాజు, వేణు సూర్య, డిఎల్‌పిఒ నూర్జహాన్, ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ పద్మజ, ఆర్‌టిసి డిపో మేనేజర్ మహ్మద్ రఫీ, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి, డిప్యూటీ తహశీల్దార్ గుండాల నాయక్, వలీ బాష పాల్గొన్నారు.

బెల్లం స్వాధీనం

ప్రజాశక్తి - ఆదోని

స్వాధీనం చేసుకున్న సారా

నవోదయం 2.0లో భాగంగా సోమ వారం ఆదోని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఆదోని పట్టణంలో గల బోయ గేరిలో 20 లీటర్ల నాటు సారా, 40 కిలోల బెల్లం స్వాధీనం చేసుకున్నామని ప్రొహిబిషన్ ఎక్సైజ్ సిఐ సైదుల్ తెలి పారు. స్వాధీనం చేసుకున్న సారా, బెల్లాన్ని మీడియా ముందు ఉంచారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడారు. బోయ శివ అనే వ్యక్తిని అరెస్టు చేసి బెల్లం అమ్మిన వ్యక్తి కుళ్లూరు గురురాజు (గురురాజా ట్రేడర్స్) మీద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బెల్లం వ్యాపారులు నిబంధనలను పాటించాలని పేర్కొన్నారు.

ఉపాధి అక్రమాలపై రి చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గుడికంబాలి వాసి

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని గుడికంబాలి గ్రామంలో ఉపాధి హామీ చట్టంలో జరుగుతున్న అక్రమాలపై చర్యలు తీసుకోవాలని మారెప్ప డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ రంజిత్ బాషాకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కుటుంబానికి చెందిన వ్యక్తులపై మస్టర్లలో అనేకసార్లు నమోదు చేసి అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. ఈ అక్రమాల్లో ఉపాధి హామీ సిబ్బంది సహకారమున్నట్లు విమర్శించారు. అక్రమాలకు పాల్పడిన ఉపాధి సిబ్బందిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

వాల్మీకి ఎస్టీ బిల్లుకు ఆమోదానికి సరైన సమయం

- ఐక్య వాల్మీకి/బోయ పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షులు వాల్మీకి లక్ష్మన్న

ప్రజాశక్తి - మంత్రాలయం

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు.. ఎస్టీ బిల్లు కేంద్ర ప్రభుత్వం ఆమోదం పొందేందుకు ఇదే సరైన సమయమని ఐక్య వాల్మీకి పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షులు బి.లక్ష్మన్న తెలిపారు. సోమవారం స్థానిక రాఘవేంద్ర నగర్ కాలనీలో ఉన్న ఆయన స్వగృహంలో వాల్మీకి యువ నాయకులు గాజులదిన్నె నాగరాజు, గంజిలి పూర్ణ నాయుడు, వెంకటేష్, దత్త, మల్లేష్, శివ వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 50 లక్షల మంది వాల్మీకులు ఉన్నారని, గత 40 ఏళ్లుగా గత ప్రభుత్వాలపై పోరాటం చేశామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సభలు, సమావేశాలు ఏర్పాటు చేశామని, ఈ అంశంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ చొరవ వల్ల రాష్ట్ర అసెంబ్లీలో వాల్మీకుల ఎస్టీ బిల్లు ఆమోదించి కేంద్రానికి పంపినట్లు చెప్పారు. ప్రస్తుతం కేంద్రంలోనూ ఎన్‌డిఎ ప్రభుత్వం ఉందని, రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో చర్చించి వాల్మీకి/బోయల ఎస్టీ బిల్లును కేంద్ర ఉభయసభల్లో ఆమోదించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

రోజూ వ్యాయామం చేయాలి

- డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి
- ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ర్యాలీ

ప్రజాశక్తి - ఆదోని

రోజూ వ్యాయామం చేయాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి తెలిపారు. సోమవారం ఆదోని పట్టణంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి, యుపిహెచ్‌సి డాక్టర్లు అనిల్, డాక్టర్ వినోద్, డాక్టర్ మహేష్, టిబి ఎంపిహెచ్ఎస్ బాబు రాజు హాజరయ్యారు. ప్రభుత్వాస్పత్రి నుంచి భీమా సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ డిఎంహెచ్ఒ సత్యవతి మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ అందరికీ ఆరోగ్యం అనే నినాదానికి కట్టుబడి పని చేయాలని, అలాగే అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే కొంతవరకైనా వారి సమయంలో 30 నిమిషాలు రోజూ వ్యాయామం చేయాలని తెలిపారు. ఇలా చేయక ప్రజలు ఊబకాయం, బద్ధకం, నీరసం, మధుమేహం వంటి రోగాలకు గురవుతున్నారని చెప్పారు. రోజూ కనీసం ఒక గంట పాటు వ్యాయామం చేస్తే, ఆరోగ్యంగా జీవించగలుగుతారని తెలిపారు.

ఆదోనిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

ఆరోగ్యమే మహాభాగ్యంగా భావించాలి : వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులకు అనుగుణంగానే ఆహారపు అలవాట్లు మార్చుకొని ఆరోగ్యమే మహాభాగ్యంగా భావించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయ సభ్యులు డాక్టర్ గోపీనాథ్ పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ దినోత్సవ సందర్భంగా దేవి నర్సింగ్ హోమ్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతేడాది ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య సంస్థ దినోత్సవంగా జరుపుకుంటామని, ప్రతేడాది మానవాళి ఆరోగ్య పరిస్థితులపై ఈ సంస్థ ఆరోగ్యానికి సంబంధించి ఒక పిలుపు ఇస్తుందని తెలిపారు. ఈ ఏడాది గర్భిణులు, శిశువులు వారి ఆరోగ్య పరిరక్షణ గురించి పిలుపు ఇచ్చిందని చెప్పారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆదోని అధ్యక్షులు కృష్ణమూర్తి, కార్యదర్శి మధుసూదన్, సీనియర్ డాక్టర్లు రమామణి, గోపీనాథ్, కృష్ణదేవరాయలు, గంగాధర్ రావు, ఉపాధ్యక్షులు హరీష్, విశిష్ట సభ్యులు అనూష, మురళీమోహన్ మాట్లాడారు.

మాట్లాడుతున్న డాక్టర్ గోపీనాథ్

కోలుకోలేక రైతు మృతి

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని బేతపల్లి గ్రామానికి చెందిన హరిజన రాజు(42) కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. హరిజన రాజు తనకున్న రెండెకరాల పొలంతో పాటు నాలుగు ఎకరాల పొలం కౌలుకు తీసుకొని పంటలు సాగు చేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. పంటల దిగుబడులు సక్రమంగా రాక పెట్టుబడులు సైతం రాక ఆర్థిక ఇబ్బందులతో ఆదివారం రాత్రి పురుగు మందు తాగారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబాన్ని పోషించే పెద్దదిక్కు కోల్పోవడంతో కుటుంబ సభ్యుల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'అంబేద్కర్ ఫ్లెక్సీ చించిన వారిపై చర్యలు తీసుకోవాలి'

ప్రజాశక్తి - హోళగుంద

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఫ్లెక్సీని చించిన వారిపై చర్యలు తీసుకోవాలని మాలమహానాడు నాయకులు కోరారు. సోమవారం మండలంలోని లింగంపల్లి గ్రామంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షులు మహానంది ఆధ్వర్యంలో కొద్ది రోజుల క్రితం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహావిష్కరణ కోసం లింగంపల్లి గ్రామంలో భూమి పూజ చేసినట్లు తెలిపారు. గ్రామకంఠం, బంజారా దొడ్డి, గవర్నమెంట్ స్థలంలో అంబేద్కర్ ఫ్లెక్సీ, జెండా ఆవిష్కరించినట్లు చెప్పారు. అదే గ్రామానికి చెందిన కొంతమంది అగ్ర కులస్తులు ఫ్లెక్సీని, జెండా కట్టను తొలగించి డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌ను అవమానపరిచి ఫ్లెక్సీని చించేశారని తెలిపారు. దీనిపై విచారించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఫ్లెక్సీ చించిన వారిని గ్రామ బహిష్కరణ చేయాలని డిమాండ్ చేశారు. మాల మహానాడు యూత్ డివిజన్ అధ్యక్షులు వెంకటరాముడు, మాల మహానాడు కన్వీనర్ భరత్, నాయకులు మల్లికార్జున, హనుమంతు, రాముడు, భీమలింగ, మల్లి, మూర్తి, రమేష్ పాల్గొన్నారు.

కంప్యూటర్ ఆపరేటరా.. మజాకా..!

- పని కావాలంటే పైసలు ఇవ్వాల్సిందే - 25 ఏళ్లుగా ఒకే చోట పోస్టింగ్

ప్రజాశక్తి - హోళగుంద

తహశీల్దార్ కార్యాలయంలో సాధారణ కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న నరసప్పకు చెయ్యి తడపనిదే పనులు ముందుకు సాగడం లేదు. గత 25 ఏళ్లుగా కదలకుండా ఒకే చోట పోస్టింగ్ చేస్తున్నాడంటే ఇక్కడికి వచ్చిన తహశీల్దార్లను ఏ రకంగా మేనేజ్ చేసి ఉంటాడో ఇట్టే అర్థమవుతుంది. కార్యాలయంలో రైతులకు సంబంధించిన పనులు ఇతరత్రా పనులు త్వరగా పూర్తి కావాలంటే కంప్యూటర్ ఆపరేటర్ అవసరం ఎంతగానో ఉంటుంది. కీలకమైన తహశీల్దార్ 'డిజిటల్ కీ' కూడా ఆయనకు తెలిసే ఉంటుంది. రైతులు తమకు సంబంధించిన సమస్యలపై కంప్యూటర్ ఆపరేటర్‌ను సంప్రదిస్తే ప్రతి పనికీ ఓ రేటు నిర్ణయించి వారి వద్ద నుంచి రూ.వేలల్లో వసూలు చేస్తున్నాడని విమర్శలు వినిపిస్తున్నాయి. రైతుల ఈ పాస్ పుస్తకాలకు సంబంధించి తహశీల్దార్, ఆర్ఐ, విఆర్ఒలు అప్రూవల్ ఇచ్చినా డబ్బులు ఇవ్వని వారి పనులను నిర్లక్ష్యం చేస్తూ రోజుల తరబడి వారిని కార్యాలయాలు చుట్టూ తిప్పుకుంటున్నట్లు తెలిసింది. ఈయనకు కార్యాలయ పనుల కన్నా డబ్బులు వచ్చే పనులపై మక్కువ ఎక్కువ. గతంలో ఇక్కడ పని చేసిన తహశీల్దార్లకు ఈయన మధ్యవర్తిగా వ్యవహరిస్తూ ఇక్కడ పనిచేస్తున్న విఆర్ఒలు, విఆర్ఎలు, సిబ్బంది సమాచారం అందించడమే కాకుండా వారి వ్యక్తిగత విషయాలను సైతం చెప్పి మెప్పించడంలో ఈయన దిట్ట. మండలంలో ఏయే గ్రామాల్లో సాగు భూములు ఎంత డిమాండ్ ఉన్నాయో రైతుల నుంచి ఎంత డబ్బులు దండుకోవాలో తెలియజేయడంలో ఈయనకు ఎవరూ సాటి లేరని మండల ప్రజలు పేర్కొంటున్నారు. గతంలో పనిచేసిన తహశీల్దార్ల కుటుంబ సభ్యులకు ఈయన అకౌంట్‌లో నుంచి రూ.లక్షల్లో డబ్బులు బదిలీ అయినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కంప్యూటర్ ఆపరేటర్‌ను ఎవరైనా ప్రశ్నిస్తే చిందులు వేస్తూ తనకు ఇక్కడ ఉద్యోగం అవసరం లేదని, బదిలీ చేస్తే ఇతర ప్రాంతాలకు వెళ్తానని మాట్లాడడం గమనార్హం. ఈ విషయంపై గత పది రోజుల క్రితం విలేకరులు ప్రశ్నిస్తే... తహశీల్దార్ దగ్గరికి వచ్చి 'నన్ను రిలీవ్ చేయండి. వెళ్లిపోతాన'ంటూ చిందులు వేస్తున్నాడంటే ఉన్నతాధికారుల పట్ల ఆయనకు ఏమాత్రం గౌరవం ఉందో తెలుస్తుంది. ఇదంతా కేవలం 'హై డ్రామా' అని, అలాంటప్పుడు గతంలో ఎమ్మిగనూరుకు ట్రాన్స్‌ఫర్ వచ్చినప్పుడు వెళ్లకుండా అధికారుల కాళ్లు, వేళ్లా పడి ఇక్కడే ఉంటున్నాడంటే ఇక్కడ ఆయనకు ఎంత ఆదాయం వస్తుందో ఇట్టే అర్థమవుతుంది. ఇప్పటికైనా సబ్ కలెక్టర్ స్పందించి కంప్యూటర్ ఆపరేటర్‌పై విచారణ చేపట్టి, చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

హోళగుంద తహశీల్దార్ కార్యాలయం

వైభవంగా రథోత్సవం

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని బదినేహాల్ గ్రామంలో వెలసిన శ్రీమల్లికార్జున స్వామి, సులేకేరి గ్రామ సమీపంలో వెలసిన శ్రీబుడుముల దొడ్డి ఆంజనేయ స్వామి రథోత్సవం సోమవారం వైభవంగా సాగింది. గ్రామాల్లో రథోత్సవం కార్యక్రమం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు, బంధువులు భారీ సంఖ్యలో తరలి రావడంతో పండగ వాతావరణం నెలకొంది. తమ అభిమాన నాయకుల ఫ్లెక్సీలు వేసి అభిమానాన్ని చాటుకున్నారు. వేలాది మంది భక్తుల సమక్షంలో రథోత్సవం కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని రథోత్సవాన్ని తిలకించారు. స్వామి వారిని వైసిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి దర్శించుకున్నారు. వైసిపి సీనియర్ నాయకులు లక్ష్మారెడ్డి, నకేష్ రెడ్డి, వైసిపి కోసిగి మండల ఇన్‌ఛార్జీ మురళీ రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు.

సిసి రోడ్డు పనులు ప్రారంభం

- కృతజ్ఞతలు తెలిపిన కాలనీ వాసులు

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని చిలుకలడోణ గ్రామ ఎస్సీ కాలనీలో అసంపూర్తిగా వేసిన సిసి రోడ్డుపై ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ దృష్టికి కాలనీ వాసులతో కలిసి తీసుకెళ్లడంతో వారి చొరవతో మిగిలిన సిసి రోడ్డు పనులు ప్రారంభమయ్యాయని ఎపి ఎంఆర్‌పిఎస్ నాయకులు గుండుపోగుల నేపాల్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కార వేదిక ద్వారా కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించానని ఎమ్మెల్యేను సంప్రదించినట్లు చెప్పారు. గ్రామంలోని సిసి రోడ్డు మొత్తం కాకుండా సగమే వేసినందుకు సబ్ కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో వెంటనే స్పందించి వారు అధికారులపై ఒత్తిడి తెచ్చి పనులు చేయించే ప్రయత్నం చేశారని చెప్పారు. సబ్ కలెక్టర్ భరద్వాజ్‌కు, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి, సర్పంచి గుజ్జుల నాగమ్మకు కృతజ్ఞతలు తెలిపారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రభాకర్, దావీద్, సత్య వేదమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

అనుమతులు లేకుంటే కేసులు పెడతాం : ఎస్ఐ

ప్రజాశక్తి - మంత్రాలయం

గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండా అక్రమంగా హోమ్ స్టే నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ శివాంజల్ హెచ్చరించారు. సోమవారం స్థానిక హోమ్‌స్టే నిర్వాహకులతో పోలీసు స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం ఇవ్వవద్దని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



14న రాజ్యాంగ వజ్రోత్సవాలు

- అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ

ప్రజాశక్తి - కౌతాళం

బిఆర్.అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా ఈనెల 14న ఎమ్మిగనూరు పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో దళిత, బహుజన, గిరిజనులతో రాజ్యాంగ వజ్రోత్సవాలు తలపెట్టినట్లు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్ ఎస్.దేవసహాయం, కమిటీ ఛైర్మన్ పరిగెల భాస్కర్, వైస్ ఛైర్మన్ బుడగజంగం రుద్రాక్షల పెద్దయ్య తెలిపారు. సోమవారం అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ నాయకులు కదిరికోట ఆదెన్న, జి.ఆనంద్ చైతన్య మాదిగ కలిసి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈనెల 14న ఉదయం 10 గంటలకు పట్టణంలోని ఆది ఆంధ్ర పాఠశాల, ఎంబి చర్చి దగ్గర నుంచి సభా స్థలం వరకు భారీ ర్యాలీ ఉంటుందన్నారు. అనంతరం జరిగే అంబేద్కర్ జయంతోత్సవ సభ, రాజ్యాంగం వజ్రోత్సవ వేడుకల్లో వేలాదిమందిని ఉద్దేశించి వక్తలు ప్రసంగిస్తారని తెలిపారు. ర్యాలీలో యువ కుల చేత కర్ర సాము విన్యా సాలు, కోలాటంతో పాటు వందకు పైగా డప్పులతో 'దరువు' ఉంటుందని చెప్పారు. కర్నూలుకు చెందిన ప్రజానాట్య మండలి వారితో ర్యాలీలో నృత్య ప్రదర్శన ఉంటుందని తెలిపారు. నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు డి.బాలయ్య, మాల ఉసేని, టీచర్ ఎరుకల కృష్ణ, టీచర్ ఆరెకంటి భాస్కర్, గంజహళ్లి మహాదేవ్ మాదిగ, బుడగజంగం రుద్రాక్షల దస్తగిరి, ఎస్.రాజు, సోగనూరు ఆనందరావు, కనకవీడు రాజు, రోజా ఆర్ట్స్ ఉసేని, కలుగొట్ల మాల రాజా రమేష్, సుమాల ఆంథోని, వివిధ గ్రామాల ప్రతినిధులు గుడికల్ స్వామి దాసు, కోటేకల్ బాలస్వామి, బనవాసి జేమ్స్, గురజాల దేవరాజు, ముగతి నరసన్న, హాలహర్వి బుదూరు ప్రకాశం, గంగవరం శాంతిరాజు, కె.తిమ్మాపురం మల్లేష్, గార్లదిన్నె ప్రకాశం, పూల చింత నగేష్, ఇబ్రహీం పురం ఏసు రాజు, చిన్న కొత్తిలి జయరాజు, కడివెల్ల పరమేష్, కందనాతి దేవదాసు, కంబాలదిన్నె రాముడు, దేవబెట్ట హనుమంతు, టి.సోమల గూడూరు రాజు, ఎమ్మిగనూరు పట్టణ నాయకులు అలువాల నాగరాజు, కూలూరు ఇస్సాక్, కదిరికోట అశోక్ ఆర్ట్స్, ఎరుకల శివ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

కరపత్రాలను విడుదల చేస్తున్న ఉత్సవ కమిటీ నాయకులు

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, KURNOOL.

E.P. No. 260/2021 in O.S. No. 917/15

M. Nageswara Rao .... D.Hr/Petitioner

Vs

M. Mohan Babu ...J.Dr./Respondent

To, J.Dr.
M. Mohan Babu, S/o. Pedda Sunkanna, aged 33 years, Hindu, R/o. H.No. 5-87, H.Kottala (V), Hussainapuram (Post), Orvakal (M), Kurnool (Dist)

పై కోర్టు యందు D.Hr తనకు రావలసిన బాకీ వసూళ్ళ నిమిత్తము J.Dr. అయిన నీపై పై E.P దాఖలు చేసియుంటున్నాడు. సదరు E.P యందు ఘనమైన కోర్టు U/o 21 Rule 54 Notice షెడ్యూలు దాఖలు ఆస్థిని జప్తుచేయించుటకు గాను కోర్టు వారు ఆర్డర్ వేసియుంటున్నారు. సదరు E.P. పైన నీకు ఏమైన ఆక్షేపణలు వున్న యెడల తేది 9-5-2025 ఉ॥10-30 ని॥లకు హాజరుకావలెను లేనిచో నీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

SCHEDULE

The House bearing D.No. 5-87, Main Road, H.Kottala (V), H.O. Hussainapuram, Orvakal (M), Kurnool (Dt).

BOUNDED :
East : Pinnapuram Seshanna House
West : Vadde Subbanna House
North : Road
South : Baja Achanna House

వాయిదా తేది : 9-5-2025

M.D.V. Jogaiah Sharma
D.Hr. తరం అడ్వకేట్, కర్నూలు.

తల్లి ,నవజాత శిశువుల ఆరోగ్యం కాపాడుదాం

కెఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ

మాట్లాడుతున్న కెఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

తల్లి, నవజాత శిశువుల ఆరోగ్యం విషయంలో ఆరోగ్యకరమైన ప్రారంభం - ఆశాజనక భవిష్యత్తు నినాదంతో ముందుకు సాగాలని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కర్నూల్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ అన్నారు. సోమవారం కర్నూలు మెడికల్ కాలేజీలో ఎన్ఎస్ఎస్, కమ్యునిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో న్యూ లెక్చరర్ గ్యాలరీలో 'ప్రపంచ ఆరోగ్య దినోత్సవం' సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తల్లులు గర్భిణిగా ఉన్న సమయంలో బలవర్ధకమైన ఆహారం తీసుకోవడం, టీకాలు, సురక్షితమైన ప్రదేశంలో కాన్పులు కావడం, కాన్పు తర్వాత తల్లి బిడ్డల ఆరోగ్యం విషయంలో ప్రతిష్టమైన ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పాటు చేయడం ద్వారా తల్లి పిల్లల భవిష్యత్తు ఆశాజనకంగా ఆరోగ్యకరంగా ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ విభాగం నిర్వహించిన క్విజ్‌లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ లు డాక్టర్. హరి చరణ్, డాక్టర్ రేణుకా దేవి, కమ్యూనిటీ మెడిషన్ విభాగం ప్రొఫెసర్ అండ్ హెచ్ఒడి డాక్టర్ సుధా కుమారి, ప్రొఫెసర్ సింధియాశుభప్రద ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారి డాక్టర్ అరుణ వివిధ విభాగాల అధిపతులు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పీజీ, యూజి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కోడుమూరులో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

-తల్లి ఆరోగ్యమే బిడ్డకి శ్రీరామరక్ష
-జిల్లా సంచార చికిత్స ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రఘు

ప్రజాశక్తి-కోడుమూరు రూరల్

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జిల్లా సంచార చికిత్స ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రఘు అధ్యక్షతన కోడుమూరులో కోలోకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీమంతు మాదన్న ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ రఘు మాట్లాడుతూ ఈ సంవత్సరం ప్రపంచ ఆరోగ్య సంస్థ తల్లి బిడ్డల ఆరోగ్యానికి ప్రాముఖ్యత నిస్తూ ఆరోగ్యకరమైన ప్రారంభం ఆశాజనక మైన భవిష్యత్తు అనే పిలుపు నిచ్చిందని తెలిపారు. ప్రతి మహిళ గర్భంతో ఉన్నప్పుడూ కనీసం నాలుగు సార్లు ఆసుపత్రిలో నిపుణులతో పరీక్ష చేయించుకోవాలి, కనీసం 3 సార్లు స్కానింగ్ చేయించుకోవాలి. బిడ్డకు ఏమైనా అవయవ లోపాలు ఉన్నాయా, బిడ్డ సరిగ్గా పెరుగుతుందా లేదా చూడాలన్నారు. 90 శాతం తల్లుల మరణాలు నివారించదగ్గవే ఉంటాయని, వారికి రక్తపోటు,శరీరం బలహీనంగా ఉండటం, బలమైన ఆహారం తీసుకోకపోవడం ప్రధాన సమస్యలుగా ఉంటాయన్నారు. బిడ్డకు ఇన్ఫెక్షన్లు సోకకుండా యాంటీబయటిక్స్ ఇచ్చే వీలుంటుందని, బిడ్డ పుట్టిన రెండేళ్ల వరకు కొన్ని టీకాలు,ఐదు సంవత్సరాలకి కొన్ని టీకాలు ఇవ్వాలన్నారు. బిడ్డ పుట్టిన ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలను,రెండు సమవత్సరాల వరకు తల్లిపాలతో పాటు ఇతర ఆహార పదార్థాలను ఇవ్వాలన్నారు. ఇవన్నీ చేస్తే కచ్చితంగా తల్లి , బిడ్డల మరణాలకు నివారించేందుకు తోడ్పడు తాయని తెలిపారు. ఆరోగ్య విస్తరణాధికారి నరసప్ప హెల్త్ సూపర్వైజర్స్ కె .కమాల్ సాహెబ్, ఉమాబాయి , ప్రాజెక్టనిస్ట్ ఖలీల్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు మరియు ప్రజలు పాల్గొన్నారు.

కోడుమూరులో అవగాహ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు , ఆరోగ్య సిబ్బంది

'అశోక'లో ఘనంగా 2025 టెక్నికల్ ఫెస్ట్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

అశోక ఉమెన్స్ ఇంజినీరింగ్ కాలేజ్ (స్మార్ట్ క్యాంపస్) లో ఏప్రిల్ 6, 7 తేదీలలో టెక్నికల్ ఫెస్ట్ ఆవిష్కార్ 2025 ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఇంజినీరింగ్ విద్యార్థుల్లో -సృజనాత్మకత, పరిశోధనా మేధస్సు, ప్రావీణ్యతను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో ఈ వేడుక నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుండి, ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన 500 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు, పోస్టర్ ప్రెజెంటేషన్స్, పేపర్ ప్రెజెంటేషన్స్ ను ప్రదర్శించారు. ముఖ్యంగా సస్టైనబిలిటీ, ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, గ్రీన్ టెక్నాలజీ వంటి ఆధునిక అంశాలపై ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ప్రదర్శనలను ప్రముఖ విద్యావేత్తలు జ్యూరీలుగా వ్యవహరించి తమ విలువైన సూచనలు అందించారు. కర్నూలు త్రిపుల్ ఐడిడిఎం నుంచి డాక్టర్ ఆర్ సీతారామ్, అనంతపురం జెఎన్‌టియు ప్రొఫెసర్ జి. శ్రీధర్, ఆర్‌జిఎం కళాశాలనుంచి డాక్టర్ వి.నరసింహులు, పుల్లారెడ్డి కాలేజీ నుంచి డాక్టర్ రామేశ్వరరెడ్డి, డాక్టర్ ప్రసన్న, డాటి.స్వాతి, రాయలసీమ యూనివర్సిటీ డాక్టర్ జి రేణుక పాల్గొన్నారు. వారు ప్రేరణాత్మక ప్రసంగాలు ఇచ్చి, విద్యార్థులను పరిశోధనాపరమైన దిశగా ముందుకెళ్లమని ప్రోత్సహించారు. అనంతరం విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈనెల 6న నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశం, మంచి స్పందనను పొందింది. ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. నవీన్ మాట్లాడుతూ ఆవిష్కార్ 2025, విద్యార్థుల సాంకేతిక ప్రతిభను ప్రదర్శించడానికి ఒక గొప్ప వేదికగా నిలిచిందన్నారు. సమాజానికి ఉపయోగపడే పరిష్కారాలను కనుగొనాలనే ఆలోచనను విద్యార్థుల్లో పెంపొందించంచామని తెలిపారు. అశోకా మహిళా ఇంజినీరింగ్ కళాశాల సిఇఒ డాక్టర్ హరీష్ కృష్ణ మాట్లాడుతూ ఇలాంటి ఈవెంట్లను నిర్వహించడం వల్ల ఇంజనీరింగ్ కాలేజీలు విద్యా , సాంకేతిక రంగాలలో జ్ఞానం,వృత్తిపరమైన అభివృద్ధికి గణనీయమైన సహకారం అందించగలవని అన్నారు.

కొంగనపాడు , పుసులూరులో శ్రీరామ నవమి రథోత్సవం

ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

కల్లూరు మండలం కొంగనపాడు, పుసులూరు గ్రామాలలో శ్రీరామనవమి పండగను పురస్కరించుకొని ఆయా గ్రామాలలో వేరువేరుగా శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవంలో భాగంగా రథోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి రథోత్సవానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు . ఈ కార్యక్రమంలో ఎపి ఫైనాన్స్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ డి రామాంజనేయులు, మండల నాయకులు పుసులూరు ప్రభాకర్ రెడ్డి ,పల్లె సుధాకర్ రెడ్డి ,నాయకల్లు మాదేశ్ ,కొంగనపాడు వినోద్, మురళి ,ఆయా గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు

కొంగనపాడులో ఎమ్మెల్యే గౌరు చరితను సన్మానిస్తున్న టిడిపి నాయకులు , స్థానికులు

వికలాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న మంత్రి భరత్ , కలెక్టర్, గోవింద్‌రెడ్డి

వికలాంగులకు రెడ్ క్రాస్ సొసైటీ చేయూత

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం" సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారి సహాయ సహకారంతో జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం పథకం కింద గుర్తించిన విభిన్న ప్రతిభావంతులకు వీల్ చైర్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి. భరత్ , కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కర్నూలు చైర్మన్ డాక్టర్ గోవిందరెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

వొకేషనల్ కాలేజీలో ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్: కకర్నూలు బి క్యాంప్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలలో సోమవారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన పెంపొందించడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి సంవత్సరం ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహిస్తుందన్నారను. ధూమపానం, మద్యపానం, జంక్ ఫుడ్ తదితర వాటి వినియోగం వలన కలిగే దుష్పరిణామాలను వివరిస్తూ, ఆరోగ్యమే మహా భాగ్యం అని , ఆరోగ్య వంతమైన జీవితం కోసం ప్రతి రోజూ నడక , వ్యాయామం చేయడం అలవరచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్స్ మల్లికార్జున, విజయశేఖర్, సోమేష్ , సుజాత విద్యార్థులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలలో సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పిహెచ్‌సిలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎన్.అలివేలు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ను ఐద్వావ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎన్.అలివేలు, ఐద్వా కోశాధికారి సుజాత, జిల్లా నాయకులు శ్యామల, పద్మ, వేణమ్మ,పర్వీన్ అనసూయమ్మ కుమారిలు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సర్వే చేసిన సందర్భంగా పిహెచ్‌సి సెంటర్లలో మౌలికమైన సమస్యలు ప్రధానంగా నీళ్ల సౌకర్యం, ప్రహరీ గోడలు లేకపోవడంతో రాత్రిపూట కొంతమంది ఆకతాయిలు తాగి అసాంఘిక కార్యక్రమాలకు పాలపడుతున్నారన్నారు. ఇలాంటి సాంఘిక కార్యక్రమాలు జరగకుండా ఉండాలంటే కచ్చితంగా ప్రహరీ గోడలు నిర్మించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి 24 గంటలు పనిచేసేలాగా ఉంచాలన్నారు. దాంతోపాటు వాచ్‌మెన్‌ను కూడా పెట్టాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎక్కడైతే ఎక్కువమంది పిహెచ్‌సి సెంటర్లకు అనారోగ్యాలరీత్యా వస్తుంటారో అక్కడ 24 గంటలు వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏరియాలోనీ ప్రజానీకాన్ని కలుపుకొని ఐద్వా ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించాల్సి వస్తుందనేసి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఫిర్యాదుల పరిష్కారంలో పారదర్శకత

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో తప్పనిసరిగా పాదర్శికత పాటించాలని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ అధికారులకు సూచించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 9 అర్జీలు వచ్చాయి. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆదనపు కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ యన్.చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర్ రెడ్డి, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, సూపరింటెండెంట్లు క్రిస్టోఫర్, స్వర్ణలత, పారిశుధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, టిడ్కో అధికారి పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.